క్లుప్తంగా

కొవ్వూరు డీఎస్పీగా చెంచు రామారావు


కేశన చెంచు రామారావు

కొవ్వూరు: సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా కేశన చెంచు రామారావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు డీఎస్పీగా పని చేసిన వీఎస్ఎన్ వర్మను నరసారావుపేట బదిలీ చేశారు. గుంటూరులో దిశ ఉమెన్ పోలీసు స్టేషన్ డీఎస్పీగా పని చేస్తున్న రామారావుని కొవ్వూరు బదిలీపై వచ్చారు.

తహసీల్దార్ల బదిలీ

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా పలువురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. కొవ్వూరు తహసీల్దార్ బి.నాగరాజునాయక్ బదిలీ అయ్యారు. ఉండ్రాజవరం తహసీల్దార్ బి.కనకరాజును రాజమహేంద్రవరం పంపించారు. తాళ్లపూడి, గోపాలపురం తహసీల్దార్లు టి.రాధిక, బి.రవీంద్రనాధ్‌లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. నిడదవోలు తహసీల్దార్ బి.గంగరాజుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఆయన రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) కార్యదర్శిగా నియమితులయ్యారు. దేవరపల్లి, చాగల్లు తహసీల్దార్లు ఎం.రామకృష్ణ, అంకం శ్రీనివాసు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.మెరికమ్మను బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎండీ మక్బూద్ ఆలీని ఏలూరు జిల్లాకు, పెరవలి తహసీల్దార్ టి.రాజరాజేశ్వరిని రాజమహేంద్ర వరం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీసీ రహదారి, డ్రైనేజీ పనులకు అనుమతి

నల్లజర్ల: నల్లజర్ల–కొయ్యలగూడెం రహదారి పనుల్లో భాగంగా చీపురుగూడెం గ్రామంలో 300 మీటర్ల మేర సీసీ రహదారి వేస్తున్నారు. దీనిని మరో 80 మీటర్లు రెండు వైపుల పెంచాలని గ్రామ నాయకులు చెల్లు హరిబాబు, పెద్దలు గోపాలపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి హోం మంత్రి తానేటి వనిత దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వెంటనే స్పందించి ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గడపగడప నిధులు రూ.20లక్షలతో డ్రైనేజీ పనులకు గురువారం ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. రహదారులు, భవనాల శాఖ డీఈ వెంకటరమణ కూడ మరో 80 మీటర్లు సీసీ రహదారికి అనుమతించారు. ఇటీవల ఆ గ్రామంలో డ్రైనేజీ పనుల విషయంలో ధర్నాలు, రాస్తారోకో వరకూ వెళ్లింది. చివరకు హోం మంత్రి జోక్యంతో వివాదం సర్దుమణిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గాలింకి మల్లిక, గ్రామ కమిటీ అధ్యక్షుడు చెల్లు హరిబాబు, గ్రామపెద్ద తలశెట్టి మాధవరావు, రాంబాబు హోంమంత్రి వనితకు కృతజ్ఞతలు తెలిపారు.

సమష్టి కృషితోనే దోమల నివారణ


దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న లక్ష్మణరావు

నల్లజర్ల: నీటి నిల్వలు దోమలకు నిలయాలుగా మారుతున్నాయని, వాటిని నిర్మూలించాల్సిన అవసరముందని మలేరియా సబ్‌యూనిట్(తాడేపల్లిగూడెం) అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీల పరిధిలోని పుల్లలపాడు, కవులూరు గ్రామాల్లో గురువారం జరుగుతున్న ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో పెరుగుతున్న లార్వాను గుర్తించి వాటిని నిర్మూలించాలన్నారు. ప్రతి వారం డ్రైడే నిర్వహించడం ద్వారా లార్వాను నివారించవచ్చునన్నారు. ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ప్రకాష్, సత్యనారాయణ, ఆరోగ్య కార్యదర్శులు ఎ.రాణి, ఎస్.సీతారత్నం, ఎంఎల్‌హెచ్‌పీ మాళవిక, ఆరోగ్య సహాయకులు సుబ్బారావు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- మంత్రి తానేటి వనిత
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ


దేవరపల్లి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి వనిత, డ్వాక్రా మహిళలు

దేవరపల్లి: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ మహిళలను మోసం చేసిందని ఆమె అన్నారు. రుణమాఫీ జగకపోగా వడ్డీలకు చక్రవడ్డీలు బ్యాంకులు వసూలు చేశాయని ఆమె గుర్తు చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే డ్వాక్రా రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. పేదల కటుంబాల్లో విద్యాదీపం వెలిగించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత ఐదేళ్లుగా ప్రతి కుటుంబానికి రూ.5 నుంచి 6 లక్షలు లబ్ధిచేకూరిందని ఆమె తెలిపారు. మరొక రెండు నెలల్లో జరగనున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వడానికి అందరూ సిద్ధంగా ఉండాలని ఆమె కోరారు. 1533 డ్వాక్రా గ్రూపులకు రూ.15.33 కోట్ల రుణమాఫీ(డమ్మీ) చెక్కును మంత్రి తానేటి వనిత మహిళలకు అందజేశారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీవీఎస్ మూర్తి, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గడా రాంబాబు, మండల సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సర్కారు ధ్యేయం


గోపాలపురంలో మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న మంత్రి వనిత

గోపాలపురం: ప్రతి మహిళా ఆర్థికంగా పరిపుష్టి సాధించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర హోం, విపత్తులశాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో గురువారం స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో డ్వాక్రా మహిళలకు నాలుగు సంవత్సరాలుగా ఆసరా కల్పిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. 12,467 స్వయం సహాయక సంఘాలకు గాను నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.10.08 కోట్లు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి భీమోలు మీదుగా దొండపూడి ఆర్టీసీ బస్సు పురరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు. వారం రోజుల్లో బస్సు ఏర్పాటు చేస్తానని మంత్రి వనిత హామీ ఇచ్చారు. డ్వాక్రా సీసీలు తమకు వేతనాలు పెంచాలంటూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దన్, నాయకులు వెలగా శ్రీరామమూర్తి, ఎస్‌కే వల్లీ, కూసం రామమోహన్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన యల్లారేశ్వరి

ఉండ్రాజవరం : విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) నూతన డైరీ, క్యాలెండర్‌ను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు పి.నిరీక్షణరాజు, ప్రధాన కార్యదర్శి ఎల్.మూర్తి, ఆర్థిక కార్యదర్శి వై.కాశీవిశ్వనాథం, అసోసియేట్ అధ్యక్షులు పి.రమాదేవి, జిల్లా అదనపు మహిళా కార్యదర్శి రమణి తదితరులు పాల్గొన్నారు.

నన్నయ యూనివర్సిటీ టాపర్‌గా మలకపల్లి విద్యార్థి


గోల్డ్ మెడల్ అందుకుంటున్న సుజిత

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి గ్రామానికి చెందిన బొళ్ల వరపు సుజిత ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ కోర్సు చేసింది. ఆమె యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. బుధవారం జరిగిన కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ కె.పద్మరాజు చేతుల మీదుగా గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకుంది. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

సంక్షేమ సారథి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- గోపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం


గోపవరంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: పేదల సంక్షేమమే అజెండాగా సుపరిపాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గోపవరం గ్రామంలో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, తోలేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు 56 నెలలుగా అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా కుల, మత, వర్గ, పార్టీ తేడా లేకుండా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. వలంటీర్ల ద్వారా ప్రజల చెంతకే పౌర సేవలు అందిస్తున్నామని చెప్పారు. గోపవరంలో రూ.22.16 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.3.47 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్ల వంటి స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరి, వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్ల మురళీకృష్ణ, తాతపూడి నాగేశ్వరరావు, శివ, తోలేటి కృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తోంది చంద్రబాబే

- కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత


తాళ్లపూడి మండలం తరపున వైఎస్సార్ ఆసరా చెక్కులను అందజేస్తున్న తలారి

తాళ్లపూడి: ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు మొదటి స్థానంలో ఉన్నారని గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. వేగేశ్వరపురం డీవీవీ దానయ్య ఎస్టేట్‌లో డ్వాక్రా మహిళల ఆసరా చెక్కుల పంపిణీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని 1,117 గ్రూపులకు గాను రూ.10.87 కోట్లు విడుదలైన నిధుల చెక్కులను తలారి వెంకటరావు చేతుల మీదుగా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ చేస్తానని నమ్మించి డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేశారన్నారు. మోసం చేసే మొదట వరుసలో చంద్రబాబు ఉంటారన్నారు. కానీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణ మాఫీ చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం నాలుగు విడతల్లో రుణమాఫీ అందించారని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి మనకు ఉంటే బాగుంటుందని అందుకే మరొక్కసారి ఆశీర్వదించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూట పోశిరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, ఏపీఎం రోజ్‌మాణిక్యం, ఎంపీడీవో వెంకట రమణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎలిపే సుధారాణి, తిగిరిపల్లి వెంకటరావు, గండి రాంబాబు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు తోట రామకృష్ణ, గూడా విజయరాజు, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, పిట్టా శ్రీనివాస్, నక్కా చిట్టి బాబు, యాళ్ల బాబురావు, మారిశెట్టి వెంకటన్న బాబు, సిర్రా గంగారావు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.


యాదవోలు పొగాకు తోటలో పులి పాదముద్రలను గుర్తించిన గ్రామస్తులు


యాదవోలు పొగాకు తోటలో ముళ్లతీగకు చుట్టుకున్న పులి వెంట్రుకలు


యాదవోలులో పెద్దపులి సంచారాన్ని ప్రజలకు వివరిస్తున్న అటవీశాఖ అధికారులు

అమ్మో.. పులి

- మెట్టప్రాంత ప్రజలను భయపెడుతున్న పులి
- యాదవోలు పొగాకు తోటలో పాదముద్రలు
- పులి సంచరిస్తున్నట్టు అధికారుల నిర్ధారణ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం

దేవరపల్లి: మెట్టప్రాంత రైతులను పెద్దపులి భయపెడుతోంది. దాదాపు వారం రోజుల నుంచి ద్వారకా తిరుమల, నల్లజర్ల మండలాల ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేసిన పులి తన రూటు మార్చింది. బుధవారం రాత్రి దేవరపల్లి, గోపాలపురం మండలాలకు చేరుకుంది. యాదవోలులోని రైతు ఇమ్మణి నాగేంద్ర పొగాకు తోటలో పులి సంచరించినట్టు రైతులు గురువారం పులి పాద ముద్రలను గుర్తించారు. దీంతో రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకుని పొగాకు తోటలను పరిశీలించారు. ప్రజలను రైతులను అప్రమత్తం చేశారు. యాదవోలు, మాతగమ్మమెట్ట, కోమటికుంట, జగన్నాథపురం, కరగపాడు గ్రామాల్లోని పొలాల్లో పులి సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం యాదవోలు, మాతగమ్మమెట్ట ప్రాంతంలో పులి ఉన్నట్టు రాజమహేంద్రవరం ఫారెస్ట్ అధికారి ఎల్.ధర్మరాజు తెలిపారు. మాతగమ్మమెట్ట, కరగపాడు అటవీ ప్రాంతం ద్వారా పాపికొండల అభయారణ్యంలోకి చేరవచ్చునని ఒక అంచనా వేశారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బిక్కుబిక్కుమంటూ..

అధికారుల హెచ్చరికలతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 7 గంటలు దాటే వరకూ రైతులు పొలాలకు వెళ్లవద్దని, గుంపుగా మాత్రమే వెళ్లాలని గ్రామాల్లో అధికారులు ప్రచారం చేస్తున్నారు. సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత ఇంటికే పరిమితం కావాలని హెచ్చరికలు జారీ చేశారు. పులి సంచారంపై వాట్సప్‌ల్లో అసత్య ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండాలని..

యాదవోలు పరిసరాల్లో పెద్దపులి ఉన్నట్టు గురువారం రాత్రి అటవీశాఖ అధికారులు చెప్పారని, గ్రామస్తులు, రైతులను అప్రమత్తం చేసేలా గ్రామంలో విస్తృతంగా మైక్ ప్రచారం చేయాలని చెప్పినట్టు సర్పంచ్ సున్నం వరప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల్లో అటవీశాఖ అధికారులు ఆపరేషన్ చేపట్టారు. యాదవోలులో గ్రామ సచివాలయం వద్ద అటవీశాఖ అధికారులు రైతులు, గ్రామస్తులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే ద్వారాక తిరుమల, నల్లజర్ల మండలాల్లో సంచరిస్తున్న పులి, యాదవోలు ప్రాంతంలో సంచరిస్తున్న పులి ఒకటా? కాదా అనే అనుమానం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఒకటి అయితే కాదని, రెండు మూడు పులులు ఉండవచ్చునని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పులి పాదముద్రలు చూస్తుంటే పులి పెద్దదేనని అధికారులు అంటున్నారు. ఈ ఆపరేషన్‌లో ఏలూరు, జంగారెడ్డిగూడెం సబ్ డ ఎఫ్ఓలు, పోలవరం రేంజ్ అధికారి దావీదురాజు, డీవైఆర్ఓ వేణుగోపాల్, శ్రీను, శ్రీశైలం, టైగర్ టీం పాల్గొన్నారు.

ఉద్యాన సాగుపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న మాధవి

చాగల్లు: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెంకటరమణ గూడెం విద్యార్థులు గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా గురువారం నెలటూరు గ్రామంలో సీతారామ కల్యాణ మండపంలో గురువారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవి మాట్లాడుతూ ఇక్కడ గ్రామాల్లో రైతుల్లో చాలా మంది అభ్యుదయ రైతులు ఉన్నారని వారు శాస్త్రవేత్తల లాగా సాగులో ఎంతో ఆసక్తితో కొత్త రకం ఉద్యాన మొక్కలు సాగు చేస్తున్నారని అన్నారు. సేంద్రియ సాగు పై కూడా చాలా అవగాహనతో ఉన్నారని అన్నారు. అభ్యుదయ రైతులు, విద్యార్థినులు చెప్పిన ఫీడ్ బ్యాక్‌ను బట్టి ఈ గ్రామీణ పని అనుభవ కార్యక్రమం చాలా సఫలీకృతమైందని అన్నారు. గ్రామీణ పని అనుభవం కార్యక్రమం ద్వారా ప్రాక్టికల్‌గా పొలాల్లో రైతులతో మమేకమై ఉద్యాన సాగు గురించి నేర్చుకున్నారని చెప్పారు. డాక్టర్ జి.రామానందం మాట్లాడుతూ గ్రామీణ పని అనుభవ కార్యక్రమం గురించి వివరించారు. విద్యార్థినులు పసివేదల, నెలటూరు, కలవలపల్లి గ్రామాల్లో గత మూడు నెలలుగా రైతులతో మమేకమై క్షేత్రస్థాయిలో జీవన పంటలు సాగు గురించి తెలుసుకున్నారన్నారు. గ్రామ సర్పంచ్ యడ్లపల్లి ఉమా రజిని, రైతులు రామారావు, మురళి, కె.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంలో మేముసైతం..


నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆర్గానిక్ కూరగాయల స్టాల్

నల్లజర్ల: వీరంతా గృహిణులు, ఓ వైపు ఇంటి పనులు చూసుకుంటూనే మరో వైపు ప్రకృతి వ్యవసాయ సేద్యంపై దృష్టి సారిస్తున్నారు. వీరికి నాచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్‌తో పాటు పీఆర్పీలు, సీఆర్పీలు సాయం అందిస్తున్నారు. తమకున్న కొద్దిపాటి భూమిలోనే ప్రకృతి సిద్ధంగా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. తక్కువ ఖర్చుతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు పండిస్తున్నారు. శింగరాజుపాలెం, పుల్లలపాడు, ముసుళ్ళగుంట, మారెళ్ళమూడి తదతర గ్రామాల్లో మహిళలు ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలను ఆయా గ్రామాల్లో కావాల్సిన వారికి విక్రయిస్తూ మిగిలిన వాటిని ప్రతి సోమవారం మండల పరిషత్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో విక్రయిస్తున్నారు. వీటితో పాటు బియ్యం, బెల్లం, బొప్పాయి తదితర ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఉద్యోగులతో పాటు సామాన్య కొనుగోలుదారులు ఆసక్తిగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ స్టాల్ వద్ద సిబ్బంది కనకదుర్గ, కోటేశ్వరి, మనోహర్, వీరాస్వామి పాల్గొన్నారు.

ఘనంగా జీఎస్ రావు జన్మదిన వేడుకలు


గోపవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: రాజకీయాల్లో మచ్చలేని నాయకుడికి మాజీ ఎమ్మెల్యే జీఎస్‌రావు సుదీర్ఘ కాలంగా ప్రజలకు సేవలందించారని, ఆయన బాటలోనే నియోజకవర్గంలో అవినీతిరహిత పాలన అందించడం ఎంతో గౌరవంగా ఉందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గోపవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ రాజకీయ సలహాదారులు, మాజీ ఎమ్మెల్యే జీఎస్‌రావు జన్మదిన వేడుకలను పార్టీశ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జీఎస్ రావు సంపూర్ణ ఆరోగ్యంగా మళ్లీ ప్రజల్లోకి రావాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, తోలేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, రొటేరియన్స్ కోసూరి అప్పారావు, గుంటుపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, గోన్నాబత్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు మద్దతుగా నేడు మోటారు సైకిళ్ల ర్యాలీ

కొవ్వూరు: పట్టణంలో మెరకవీధి వాటర్ ట్యాంకు వద్ద వైఎస్సార్ విగ్రహం నుంచి శుక్రవారం ఉదయం పది గంటలకు పట్టణంలో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. శనివారం దెందులూరు సమీపంలో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ చేపడుతున్నామని, ఈ ర్యాలీ అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

అందరం సమన్వయంతో పనిచేద్దాం


వేములూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున నాయకులంతా సమన్వయంతో పని చేసి పార్టీని మరింత బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు సూచించారు. గురువారం రాత్రి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణతో కలిసి మండలంలో పశివే దల, వేములూరు, తొగుమ్మి గ్రామాల్లో పార్టీ నాయకులను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. గ్రామాల వారీగా ఆయా గ్రామాలకు చెందిన స్థానిక నాయకులను పరిచయం చేసుకున్నారు. రానున్న రోజుల్లో పార్టీ కోసం సమయం కేటాయించాలని కోరారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పరిమి వెంకట్రావు, పరిమి సోమరాజు, మండల వైఎస్ ఎంపీపీ నూతంగి రేఖ, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, గారపాటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ ఉప్పులూరి విజయలక్ష్మి, ఉప్పులూరి సూరిబాబు, కంఠమణి రమేష్, కొటికలపూడి అబ్రహం లింకన్, సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, తోట రామకృష్ణ, ఎలికే చిన వీర్రాజు, ముప్పిడి విజయరావు, ఉప్పులూరి రాజబాబు, ఇమ్మణ్ణి వీరశంకరం, గెల్లా రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.